
# * చూడామణికి చూపొచ్చింది *

విశ్వనాథం, జగదాంబలకు ఇద్దరు సంతానం. మొదటి సంతానం ఆడపిల్ల. పేరు సీత. పిల్ల అందంగా ఆరోగ్యంగా లక్షణంగా ఉంటుంది. రెండో సంతానం మగబిడ్డ. పేరు చూడామణి!




చూడామణి అందంగా ఆరోగ్యంగా బాగానే ఉంటాడుకానీ అదేం దురదృష్టమో మరి... దృష్టిలేకుండా పుట్టాడు. చూడామణి సీత పుట్టిన ఆరేళ్ళకి పుట్టాడు. లేకలేక పుట్టిన మగబిడ్డ ఇలా అంధుడిగా పుట్టడంతో విశ్వనాథం దంపతులు విలవిల లాడిపోయారు.

"అదే సినిమాల్లో అయితే హీరోయిన్లు ఇంచక్కా పాట పాడ్తూ దేవుడ్ని చావతిడ్తారు.... నాకు పాటైనా పాడ్డం రాకపోయింది కదా!..." అంటూ బాధపడింది జగదాంబ.

"ఊర్కో జగ్గు... ఇంకా మన జీవితకాలం చాలా ఉంది... ఎప్పటికైనా ఓ మంచి పాట నేర్చుకుని తిడ్దువుగాని..." భార్యని ఓదార్చాడు విశ్వనాథం.

"సంగీతం నేర్చుకుని పాడేంతదాకా నేనాగలేనండీ... నేనర్జంటుగా పాడెయ్యాలంతే!! ..." అంది జగదాంబ. అలా అనడమేంటి ఇలా మ్యాట్నీషో "బుల్ బుల్ పిల్లోడు - జిల్ మిల్ పిల్ల" సినిమాకి వెళ్ళడమేంటి అంతా నిమిషాల మీద జరిగిపోయింది.

జగదాంబ "బుల్ బుల్ పిల్లోడు- జిల్ మిల్ పిల్ల" సినిమాకి వెళ్ళడానికి కారణం ఉంది. ఆ సినిమాలో హీరోయిన్ సర్దాగా ఓ అర్టిపండు తినేసి తొక్క నేలమీద పారేస్తుంది. హీరో చూస్కోకుండా ఆ అర్టిపండు తొక్కమీద కాలేసి జయ్యిన జారి, ఎగిరి నేలమీదపడితే ముక్కూ మొహం ఏకమైపోతుంది. ఆ దెబ్బకి హీరో డిప్ప పగిలి ఏకధారగా రక్తం స్రవించి మూర్ఛపోతాడు. హీరోని ఆసుపత్రిలో చేరుస్తారు.

"చాలా రక్తం పోయింది... హీరోగారికి రక్తం ఎక్కించాలి! " అంటాడు డాక్టర్. అలా అనడమే తడువు డజను పిడికిళ్ళు బిగించిన చేతులు డాక్టర్ మొహం మీదికి రివ్వున వస్తాయ్.

"నా రక్తం తీస్కోండి డాక్టర్... నా రక్తం తీస్కోండి" అంటూ ఒకటే కేకలు.

"మీలో ఎవరి రక్తమూ హీరోగారి రక్తంతో కలవదు... అయాం సారీ..." అంటాడు డాక్టర్.

అందరూ దీనంగా మొహం పెట్టారు.

"మీరలా దీనంగా మొహం పెడ్తే సరిపోదు... ఎక్కడినుండైనా ఈయన గ్రూపు తీస్కుని రండి... లేకపోతే హీరో మనకి దక్కడు" అంటాడు డాక్టర్.

అందరూ ఊళ్ళో తలో మూలకీ పరుగుతీస్తారు రక్తం కోసం. కానీ ఆ గ్రూపు రక్తం ఉన్నవాళ్ళు వీళ్ళకి ఎక్కడా దొరకరు. బ్లడ్ బ్యాంకుల్లో కూడా ఆ గ్రూపు రక్తం దొరకదు.

నిమిషాలు, గంటలూ గడుస్తున్నాయ్. హీరో తలలోంచి రక్తం ఏకధారగా స్రవిస్తూనే ఉంది.

అంతలో ఎక్కడినుండో ఒక వ్యక్తి పరిగెత్తుకుని వచ్చాడు.

"డాక్టర్!... నా రక్తం తీస్కోండి డాక్టర్!" అంటూ పిడికిలి బిగించిన చేతిని ముందుకు చాచాడు ఆ వ్యక్తి.

"నీ రక్తం ఆయనకి సరిపోతుందో లేదో!" సందేహంగా అన్నాడు డాక్టర్.

"కచ్చితంగా సరిపోతుంది డాక్టర్!... ఎందుకంటే ఆయన ఉప్పూ పులుసూ తినే ఈ శరీరం పెరిగింది." ఆవేశంగా అన్నాడు అతను.

"కానీ... ఇప్పటికే చాలా రక్తం హీరో ఒంట్లోంచి పోయింది... చాలా ఆలశ్యం కూడా అయిపోయింది. ... నీ రక్తం ఎక్కించినా బ్రతుకుతాడో లేదో మరి..." అన్నాడు డాక్టర్.

హీరో ఉప్పూ, పులుసూ తిన్న వ్యక్తిని హీరో బెడ్ పక్కనే మరో బెడ్ వేసి పడుకోబెట్టారు. అతని చేతిలోంచి హీరో చేతిలోకి డైరెక్టుగా ఒక ట్యూబ్ అమర్చారు. దాంట్లోంచి రక్తం జివ్వుమని హీరోలోకి ఎక్కుతూ ఉంటుంది.

అందరూ ఆతృతగా హీరో మొహంలోకి చూస్తుంటారు. హీరో మొహంలో చలనమేమీ రాదు.

కాస్సేపయ్యాక సీరియస్ అయిపోయి హీరో బెడ్‌మీద గిలగిల తన్నుకుంటుంటాడు. హీరో ఉప్పూ, పులుసూ తిన్న మనిషి కూడా ఒంట్లోంచి రక్తం అంతా పోతుండటం వల్ల గిలగిల తన్నుకుంటూ ఉంటాడు. అతని పరిస్థితి కూడా సీరియస్‌గా మారిపోతుంది.

"ఇహ వీళ్లిద్దరి ప్రాణాల్ని ఆ దేవుడే రక్షించాలి!" అంటాడు డాక్టర్.

అంతే... హీరోయిన్ ఆసుపత్రిలోనే ఓ మూలగా ఉన్న దైవ మందిరంలోకి పరుగుతీసి ఓ పాటందుకుంటుంది.

"దేవుడివా నువ్వు
దయ్యానివా?
మహిమలు లేని మానువా?"

ఇంకా 'నీకు సిగ్గులేదు. బుద్ధిలేదు. నీకే గనుక మహిమలుంటే నా హీరో ఆయన ఫ్రండూ బతకాలి' అంటూ పాట పాడ్తుంది. పాటయ్యేసరికి హీరో అతని ఉప్పూ, పులుసూ తిన్న వ్యక్తీ ఇద్దరూ మంచాలమీద లేచి కూర్చుని పళ్లు ఇకిలిస్తారు.

ఈ సీన్ జగదాంబని బాగా ఇన్‌స్పైర్ చేసింది. సినిమా చూసి ఇంటికి రాగానే చూడామణిని దేవుడి పటం ముందు పడుకోబెట్టి సినిమాలోని పాటందుకుంది.

"దేవుడివా నువ్వు
దయ్యానివా
మహిమలు లేని మానువా?"

పాటకి ఇంకా ఒకటి రెండు తిట్లు కలిపి మరీ పాడింది. పాటంతా అయ్యింది.

జగదాంబ ఆతృతగా చూడామణి మొహంలోకి చూసింది.

ఊహూ... చూడామణికి చూపు రాలేదు. చూపులేని కళ్లు నిర్జీవంగా ఉన్నాయ్.

"నీ భ్రమగానీ... సినిమా పాట్లకి చింతకాయలు రాల్తాయా అంబా?"

భార్యవంక జాలిగా చూస్తు అన్నాడు విశ్వనాథం. జగదాంబ భర్తని కౌగిలించుకుని భోరుమంది.
సంవత్సరాలు గడుస్తున్నాయి.
చూడామణికి ఎనిమిదేళ్ల వయసు వచ్చింది. విశ్వనాథం దంపతులకి అంధుడైన కొడుకు చాలా దుఃఖాన్ని కలగజేస్తున్నాడు.
"అలా ఊర్కే బాధపడకపోతే మంచి కళ్ల స్పెషలిస్టు దగ్గరికి తీస్కెళ్ల కూడదూ, ఏమైనా ఫలితం ఉంటుందేమో?!"
విశ్వనాథం స్నేహితుడు ఒకరోజు మందలించాడు. స్నేహితుడి మాట మీద విశ్వనాథం, జగదాంబలు చూడామణిని కళ్ల స్పెషలిస్టు కన్నేశ్వర్రావు కంటాస్పత్రికి తీస్కెళ్లారు.
"ఆ... రండ్రండ్రండి..." లేచి నిలబడి అడుగులు ముందుకు వేసి ఆదరంగా ఆహ్వానిస్తూ స్టూలుని చూస్కోకుండా తన్నేసి బోర్లాపడిపోయాడు కళ్లడాక్టరు కన్నేశ్వర్రావు.
విశ్వనాథం ఆయన్ని కిందనుండి జబ్బపట్టుకుని లేపాడు.
"కళ్ల డాక్టర్నైనా అవీ ఇవీ చూస్కోకుండా ఇలా తన్నేసి కిందపడిపోవడం గమ్మత్తుగాలేదూ? హిహి..." బట్టలకంటిన దుమ్ము దులుపుకుంటూ ఓ వెర్రినవ్వు నవ్వాడు కన్నేశ్వర్రావు. "ఆ ఏంటి మీ ప్రాబ్లెం?" అడిగాడు.
చూడామణిని చూపించి సంగతి చెప్పాడు విశ్వనాథం.
"ఆ... చూడుబాబూ! ఇవెన్ని వేళ్లూ?..." చూడామణిని అడిగాడు కన్నేశ్వర్రావు నాలుగు వేళ్లు చూపిస్తూ.
"నాకు కనిపించదండీ..." అన్నాడు చూడామణి అమాయకంగా.
"చూశారా?... మీ అబ్బాయికి చూపు అస్సలు లేదు... తెల్సిందా?" అన్నాడు కన్నేశ్వర్రావు.
అతని మాటలు విన్న జగదాంబ, విశ్వనాథంలు నుదిటిమీద అరిచేత్తో కొట్టుకున్నారు.
"ఇంతసేపూ మేము చెప్పింది అదే కదండీ... వాడు పుట్టుగుడ్డి... వాడికేమీ కనబడదు–అందుకే మీరేమైనా చేస్తారని మీ దగ్గరకు తీస్కొచ్చాం..." అన్నాడు విశ్వనాథం.
వాళ్లు తనని నమ్మి వాళ్ల అబ్బాయిని తన దగ్గరికి తీస్కొస్తే తనేమీ చేయకపోతే బాగుండదని అనుకున్నాడు కన్నేశ్వర్రావు.
అందుకే చూడామణి కళ్లలో కళ్లుపెట్టి చూశాడు... "కళ్లలో కళ్లుపెట్టి చూడూ... గుండెలో గుండెకలిపి చూడూ" అనే పాటని హమ్ చేస్తూ.

ఆ తరువాత చూడామణి కళ్లకింద చర్మాన్ని వేళ్లతో నొక్కిపట్టి కిందికి లాగి ఉఫ్ అని గాలి ఊదాడు. అలా గాలి ఊదడంవల్ల రెప్పలు మూస్కున్నాడు చూడామణి.

"చూశారా... చూశారా... కళ్లెలా మూస్కుంటున్నాడో" అన్నాడు కన్నేశ్వర్రావు.

"కళ్లలో గాలి ఊత్తే ఎవరైనా కళ్లలానే మూస్తారు" అన్నాడు విశ్వనాథం.

"డాక్టర్ని నేనా మీరా?... మధ్యలో అలా మాట్లాడతారేం?" అని కోపంగా చూసి, పది క్షణాల పాటు ఆలోచించి "బాబుని అమెరికా తీస్కెళ్లి అపరేషను చేయించండి... కళ్లొచ్చేస్తాయ్... కానీ లక్షరూపాయలు ఖర్చు అవుతుంది..." చెప్పాడు కన్నేశ్వర్రావు.

తమ కొడుకు కంటి చూపుమీద ఆశ వదులుకున్నారు విశ్వనాథం దంపతులు. ఇప్పుడు లక్షరూపాయలు ఎక్కడినుండి తేగలరు?...

అలా సంవత్సరాలు గడిచిపోతున్నాయి. చూడామణికి పదిహేనేళ్ల వయసు వచ్చింది. ఆ అబ్బాయి అదృష్టం బాగుండి మంచి ఎక్స్పర్ట్ అయిన కళ్లడాక్టరు రాఘవులు అమెరికానుండి వచ్చాడు. అతను విశ్వనాథంకి చిన్నప్పటి క్లాస్‌మేట్ కూడా.

"నీకేం భయంలేదు... మీ వాడికి ఆపరేషను చేసి చూపు తెప్పిస్తాను..." విశ్వనాథానికి భరోసా ఇచ్చాడు రాఘవులు.

ఆపరేషను పూర్తయింది. చాలా సక్సెస్‌ఫుల్‌గా జరిగింది ఆపరేషన్.

ఆ రోజు కళ్లకి కట్లువిప్పి డిస్చార్జ్ చేశారు.

"కొద్దిరోజుల దాకా కంటి గుడ్లమీద ఏ మాత్రం వత్తిడి పడకూడదు. ఎప్పుడైనా కళ్లు దురదపుడ్తే నలుపుకోకూడదు. అలా చేస్తే ఆపరేషన్ ఫేలయ్యి మళ్ళీ చూపుపోయే ప్రమాదం ఉంది." ఇంటికెళ్లేటప్పుడు వాళ్లని హెచ్చరించాడు రాఘవులు.

ఈ ప్రపంచాన్ని మొదటిసారిగా చూస్తున్న చూడామణి ఎంతో థ్రిల్లింగా ఫీలయ్యాడు. రంగురంగుల పూలు, పచ్చని పచ్చిక, నీలం రంగు ఆకాశం, నదుల్లోని నీలినీలి కెరటాలు, ఎగిరే పక్షులు... ఇవన్నీచూస్తూ పులకించిపోయాడు.

ఆ మర్నాడు ఆఫీసుకెళ్తూ "జాగ్రత్త... కళ్లు నలుముకోకు..." అని కొడుకుకి చెప్పి వెళ్లిపోయాడు విశ్వనాథం.

ఆఫీసులో ఓవర్‌టైం చేసి రాత్రి ఎనిమిది గంటలకి ఇంటికొచ్చాడు.

ఇల్లంతా గోలగోలగా ఉంది. జగదాంబ, సీత భోరున ఏడుస్తున్నారు.

"ఏమైంది?...ఎందుకేడుస్తున్నారు??" కంగారుగా అడిగాడు విశ్వనాథం.

"చూడామణికి చూపుపోయిందండీ... కావాలనే కళ్ళుగట్టిగా నలిపేస్కుని చూపుపోగొట్టుకున్నాడు.!" చెప్పి మళ్ళీ భోరుమంది జగదాంబ.

"ఎందుకు?" ఆందోళనగా అడిగాడు విశ్వనాథం.

చూడామణి మాత్రం తనకేమీ పట్టనట్టు చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

"ఇంతటి భయంకరమైన ఘోరమైన దృశ్యాల్ని చూడ్డానికేనా నాకు చూపు వచ్చింది?... నాకీ కళ్ళొవద్దు, పాడూవద్దు అని కళ్ళు నలుపుకున్నాడండీ..." ఘొల్లుమంది జగదాంబ.

"ఇంతకీ అంత ఘోరమైన దృశ్యం ఏం చూశాడు? కొంపదీసి ఎవరైనా ఇంట్లో దూరి మన సీతని రేప్ చేశారా?..."

"కాదండీ..."

"నిన్నే ఎవరైనా రేప్ చేశారా?"

"కాదు... కాదు... కాదండీ..."

"పోనీ రోడ్డుమీద ఎవరినైనా కత్తులతో కసకసా పొడిచి హత్యచేసి పారిపోడం చూశాడా? "

"కాదండీ..."

"మరి అంత ఘోరమైన దృశ్యాలు ఏం చూశాడు?"

"టీవీలో తెలుగు ప్రోగ్రాములు చూశాడండీ!" ఘొల్లుమంది జగదాంబ.

* * *